
**గిరిగీసుకుని బతికే ఏ సంస్కృతీ ఎక్కువ కాలం మనజాలదు.**

నాలుగు భావాలు, పది అభిప్రాయాలు, అనంతమైన ఆలోచనలు కలిస్తేనే ఓ సంస్కృతి. అంతేకానీ, ఒక్క భావాజాలానికే పరిమితమై, దానిచుట్టూ గీత గీసుకుని.. అదే సర్వోన్నతం అనుకుంటే పతనం వైపు అడుగులు వేసినట్టే. ఆ సంస్కృతికి అల్పాయువే.






**ప్రపంచాన్ని మార్చాలనుకుంటే.. ముందు నువ్వు మారాలి!**

ఏ మార్పూ యాదృచ్ఛికం కాదు. ఏ పరిణామం అయాచితం కాదు. దాని వెనుక ఎంతోమంది కృషి ఉంటుంది. త్యాగ ఫలమూ ఉంటుంది. ఆ మార్పు తీర్పరులు ముందుగా తమను తాము మార్చుకున్నారు.

**నువ్వు ఆలోచించేది, మాట్లాడేది, ఆచరించేది.. ఈ మూడూ ఒక్కటే కావడం ఆనందం.**

మనం మనలా ఉన్నప్పుడే.. ఇదంతా సాధ్యం అవుతుంది. గాంధీ మార్గంలో నడవాలంటే.. ముసుగులు తీసేయాలి. అహాలు వదిలేయాలి. అబద్ధాలు బద్దలుకొట్టాలి. అప్పుడిక.. మన జీవితం తెరిచిన పుస్తకంగా మారుతుంది. మన జీవితమే మన సందేశం అవుతుంది.






**బలవంతుడు మాత్రమే క్షమించగలడు. బలహీనుడికి అదో సాకు మాత్రమే.**

చేతకాక, చేవచచ్చి, ఓడించలేక 'క్షమించేశాను పో' అనుకోవడం క్షమాగుణం కాదు, పక్కా పలాయన వాదం. చేతగానివాడి లక్షణం. పరోక్షంగా ఇది పిరికితనమే. ఓడించే సత్తా ఉన్నా.. అపకారం తలపెట్టకపోవడమే అసలైన క్షమాగుణం.

**మానవతను శంకించకండి. అదో సువిశాల సముద్రం. ఓ మూలన కాలుష్యం ఉన్నంత మాత్రాన.. సంద్రమంతా కలుషితమైనట్టు కాదు.**

ఆశావాదమే మనిషిని బతికిస్తుంది, సమాజాన్ని నడిపిస్తుంది. నిజమే హింస పెరుగుతున్నది. అపనమ్మకాలు ప్రబలుతున్నాయి. అంతమాత్రాన అంతా చెడే అనుకోవడానికి వీల్లేదు. మన చుట్టూ మంచి, మానవత్వం ఉన్నాయి. కాబట్టి, నిరాశ వద్దు.





**నీ అనుమతి లేకుండా నిన్నెవరూ బాధపెట్టలేరు.**

ఓసారి బుద్ధుడు శిష్యులతో కలిసి ప్రయాణిస్తుంటే.. ఎవరో తప్పుగా మాట్లాడతారు. శిష్యులంతా బాధపడిపోతారు. బుద్ధుడి మొహం మీద మాత్రం చిరునవ్వు చెదరలేదు. 'మీరు ఆ తిట్లను స్వీకరించారు. కాబట్టి బాధపడుతున్నారు. నేను స్వీకరించలేదు కాబట్టి, ఆ మాటలు నన్ను బాధించవు' అంటాడు తథాగతుడు. మహాత్ముడి మాటల అంతరార్థమూ ఇదే.



**మన సంపాదనను ఆహారానికి మాత్రమే పరిమితం చేస్తే.. ప్రపంచంలో దేనికీ, ఎవరికీ కొరత ఉండదు. జీవితాన్ని ఆనందంగా గడపడానికి తగిన సమయమూ ఉంటుంది.**

ఎంత గొప్ప మాట! మనిషి అర్థంలేని పరుగులో కస్తూరి మృగంతో పోటీపడుతున్నాడు. తన కోసం, తన పిల్లల కోసం, పిల్లల పిల్లల కోసం, ఆ పిల్లల పిల్లల కోసం.. ఏడు తరాలకు సరిపడా సంపాదించినా అసంతృప్తే. దీంతో సమాజంలో అంతరాలు పెరిగిపోతున్నాయి. సంపన్నుడు మరింత సంపన్నుడు అవుతున్నాడు. పేదవాడు నిరుపేదగా మారిపోతున్నాడు.

డబ్బు మూటల మధ్య అతనేమైనా సంతోషంగా ఉంటున్నాడా అంటే అదీ లేదు. బంధాలకు బీటలుపడుతున్నాయి. అవును, మనకంటూ ఓ పరిమితి విధించుకోవాల్సిందే.